క్లుప్తంగా

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ



బాపట్ల అర్బన్: శాఖ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వేసవి శిబిరాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. చైర్మన్ శేషగిరిరావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. గ్రంథాలయ అధికారి ఎ.శివాజీ గణేష్, విద్యార్థులు ఉన్నారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు



బాపట్ల అర్బన్: నరాలశెట్టివారి పాలెంలోని అష్ట లక్ష్మి దేవస్థానంలో మంగళవారం సహస్ర నామార్చన, ఆకు పూజ, మండ పారాధన, అభయాంజనేయస్వామికి పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి కృపకు పాత్రులయ్యారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నరాల శెట్టి ప్రకాశరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన హనుమజ్జయంతి వేడుకలు



రేపల్లె రూరల్: పట్టణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో హోమం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు.

మొక్కజొన్న కండెలు దగ్ధం



గుత్తావారిపాలెం(భట్టిప్రోలు): విద్యుదాఘాతంతో కల్లంలో ఆరబోసిన మొక్కజొన్న కండెలు దగ్ధమయ్యాయి. బాధితుడు పమిడిముక్కల సుధాకర్ వివరాల మేరకు.. పెద పులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెం హైస్కూల్ వెనుక ఉన్న పంట పొలాల్లో మంగళవారం విద్యుత్ వైరు తెగిపడి నిప్పురవ్వలు ఎగిసి పడటంతో రెండెకరాల్లోని మొక్కజొన్న దిగుబడి దగ్ధమైంది. సుమారు రూ.1.40 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు సుధాకర్ వాపోయారు. సమాచారం అందుకున్న అధికారులు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలి: పట్టణానికి చెందిన సేవా సంస్థ శ్రీ శివ లింగేశ్వర భక్త బృందం సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ వంతెన వద్ద వేసవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, కౌన్సిలరు షేక్ దుబాయ్‌బాబు, కుర్రా సుజాత, మహాప్రస్థానం సేవాసమితి అధ్యక్షుడు జెట్టి శివరామ కృష్ణప్రసాద్, వైష్ణవి జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి'పై సామాజిక తనిఖీ ప్రజావేదిక

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీత తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 2022- 23 ఆర్థిక సంవత్సరానికి జరిగిన పనులపై ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

భక్తులకు అన్నదానం

తెనాలిరూరల్: స్థానిక రామలింగేశ్వరపేటలోని సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పాలడుగు గోవర్ధన్, నాగిశెట్టి కష్టారావు, దాసరి శ్రీనివాసరావు, ఆలవాల రాంబాబు, ఆవుల కోటయ్య, హరిదాసు పాల్గొన్నారు.

తీరం.. జనసంద్రం

- సీఎం వైఎస్ జగన్ రాకతో జన సంద్రాన్ని తలపించిన తీరప్రాంతం
- మండే ఎండను సైతం లెక్కచేయని ప్రజలు
- జై జగన్ నినాదంతో కిక్కిరిసిన రహదారులు
- పూల వర్షం కురిపించిన మహిళలు
- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు



జనంతో కిక్కిరిసిన నిజాంపట్నం - రేపల్లె ప్రధాన రహదారి

నిజాంపట్నం/రేపల్లె రూరల్: తీర ప్రాంతం జన సంద్రాన్ని తలపించింది. ఎండను లెక్కచేయని అభిమానం.. జన నేతను చూసేందుకు పరుగులు తీసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాంపట్నం రాకతో తీర ప్రాంతం జనసంద్రంగా మారింది. వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని మంగళవారం వైఎస్ జగన్ ప్రారంభించి, లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేశారు. ఈ కార్యక్రమానికి తీరప్రాంతంలోని పలు గ్రామాల నుంచి భారీగా ప్రజలు తరలిరావడంతో నిజాంపట్నంలోని సభా ప్రాంగణంతో పాటు రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకూ అభివాదం చేస్తూ బస్సులో వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు భారీగా పూలు చల్లి, ఘన స్వాగతం పలికారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయక.. ప్రజలు మేడలు, మిద్దెలెక్కి అభిమాన నేతను ఆత్మీయంగా చూసుకున్నారు. సభా స్థలి ఖాళీలేక ప్రజలు రోడ్లపైనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

మహిళాభిమానం..

ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా నియోజకవర్గానికి రావటంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రెట్టించిన ఉత్సాహంతో స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు మహిళలు అభిమానంతో పూల వర్షం కురిపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం కొనసాగుతున్నంత సేపు యువకులు ఉత్సాహభరితంగా కేరింతలు కొడుతూ 'మా నమ్మకం నువ్వే జగనన్న' అంటూ నినాదాలు చేశారు. 'మాకు మంచి చేస్తున్న మీకు అండగా ఉంటామంటూ' మహిళలు కరతాళ ధ్వనులతో మద్దతు ప్రకటించారు. పలువురు చిన్నారులు జగన్‌మోహన్ రెడ్డిని గుర్తుగా తమ మొబైల్ కెమెరాల్లో బంధించారు.



చిన్నారుల నృత్యప్రదర్శన

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మత్స్యకార భరోసా నగదు విడుదల సందర్భంగా.. సభలో పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలు, జగనన్న అమ్మ ఒడి, మత్స్యకారుల జీవిత చరిత్రపై ప్రదర్శనలు చూపరులను ఆలోచింపజేశాయి. నవరత్న పథకాలు, జగన్ మామ నీకు వందనం అంటూ పట్టణంలోని ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థలకు చెందిన జాన్స్ హై స్కూలు విద్యార్థినులు సాత్విక, భవ్య, దివ్యశ్రీ, యాస్మిన్, నేహ, స్నేహ పలువురు నృత్య ప్రదర్శన చేశారు. అదేవిధంగా మత్స్యకారుల జీవిత చరిత్ర, జగనన్న నవరత్నాలపై తెనాలికి చెందిన సంధ్య, యశస్విని, యామిని, గౌతమి, దివ్య, సునీల్ తదితరుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి జెడ్పీ హైస్కూలుకు చెందిన తోట సాయిక కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది.

సీఎం సభకు తరలిన పార్టీ శ్రేణులు

భట్టిప్రోలు: భట్టిప్రోలునుంచి నిజాంపట్నంకు సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, మత్స్యకారులు ప్రత్యేక వాహనాల్లో మంగళవారం తరలివెళ్లారు. ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, మండల సమాఖ్య సిబ్బంది, నాయకులు పప్పుల విజయరాజు, తలకొల యలమంద, నాగమల్లేశ్వరరావు, బాలాజి వెళ్లిన వారిలో ఉన్నారు.

నగరం నుంచి..

నగరం: నిజాంపట్నం సీఎం సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు, ప్రజలు బస్సులు, కార్లలో తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాల్లో ర్యాలీగా వెళ్లారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

• జననేతకు ఆత్మీయ స్వాగతం





మత్స్యకార భరోసా నగదు విడుదల చేసేందుకు..నిజాంపట్నం సభకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, శాసన మండలి సభ్యులు, చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మంగళవారం స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. – నిజాంపట్నం

విద్యుత్ సర్వీసుల ఆకస్మిక తనిఖీ

రూ.5,54,900ల అపరాధ రుసుం వసూలు

రేపల్లె: పట్టణంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విద్యుత్ సర్వీసులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని 5,020 విద్యుత్ సర్వీసులు తనిఖీ చేసినట్లు తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిని గుర్తించి, రూ.5,54,900ల అపరాధ రుసుం విధించామని వెల్లడించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో రేపల్లె డీఈ ఎస్.భాస్కరరావు, టౌన్ ఏఈ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ బిల్లులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

భానుడి భగభగ.. వీధులు వెలవెల



వెలవెలబోతున్న కొల్లూరు లాక్ సెంటర్ రోడ్డు



ఎండ తాకిడికి తెనాలి-రేపల్లె రోడ్డు ఇలా..

కొల్లూరు: భానుడి భగభగల కారణంగా రహదారులు వెలవెలబోతున్నాయి. అకాల వర్షం కారణంగా వారం రోజులు చల్లదనంతో సేదతీరిన ప్రజలు అకస్మాత్తుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంగళవారం 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జనాలతో కళకళలాడే కొల్లూరు రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఉదయం 11 గంటల లోపే తమ కార్యకలాపాలను ముగించుకుని, గృహాలకు చేరుకుంటున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండి వడగాల్పులు వీస్తున్న నేపథ్యంలో ప్రజలు బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. వడ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుని మాత్రమే బయటకు రావాలని సూచిస్తున్నారు.

డెంగీ నివారణపై అవగాహన ప్రదర్శన

కొల్లూరు: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యశాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఇంటి పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణతో డెంగీ నివారణ సాధ్యమవుతుందని ప్రజలకు వివరించారు.

డెంగీ నివారణపై అవగాహన

పెరవలి(వేమూరు): డెంగీ నివారణకు ప్రతి పరిశుభ్రత పాటించాలని పెరవలి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకట సురేష్ తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమ తెరలు వాడాలి

భట్టిప్రోలు: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వెల్లటూరు, భట్టిప్రోలు పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్ రామలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, 104 వైద్యులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో డెంగీని నివారించ వచ్చన్నారు. దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించారు. చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. సీహెచ్ఓ డి.మాతయ్య, హెల్త్ సూపర్‌వైజర్ మందా ప్రసాదరావు, ప్రసన్న బాబు, హెల్త్ విజిటర్ పి.కల్యాణి, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఎలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొల్లూరు పీహెచ్‌సీలో సిబ్బంది ప్రదర్శన



ర్యాలీ నిర్వహించిన వైద్య సిబ్బంది



భట్టిప్రోలులో డెంగీపై అవగాహన ర్యాలీ

ఉపాధ్యాయులు హక్కుల కోసం పోరాడాలి

యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి

తెనాలి: ఉపాధ్యాయులు తమ విధులను అంకితభావంతో నిర్వర్తిస్తూనే, హక్కుల కోసం పోరాడాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి సూచించారు. యూటీఎఫ్ జిల్లా ఉద్యమ శిక్షణ తరగతులు మంగళవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథుల్లో ఒకరైన కుసుమ కుమారి జెండా ఆవిష్కరణ చేయగా, జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఉపాధ్యాయ ఉద్యమంలో యూటీఎఫ్ ముందుండేలా చూడాలని సూచించారు. ఉపాధ్యాయ ఉద్యమం ప్రాధాన్యం గురించి ఆదినారాయణ తరగతిని నిర్వహించారు. జిల్లా కోశాధికారి మహమ్మద్ గయాసుదుల్లా, పీవీ శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, శివపార్వతి, దౌల, కె.సాంబ శివరావు, షకీలా, కామాక్షి, బసవేశ్వరరావు, గురుబ్రహ్మం, శ్రీదేవి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుసుమకుమారి

భక్తిశ్రద్ధలతో సిందూర అర్చన

తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, 15వ లక్ష హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శ్రీమన్యసూక్త హోమం, సిందూర అర్చన వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ నెల 24 వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని, స్వామివారిని దర్శించుకోవాలని అవుతు శ్రీనివాసరెడ్డి కోరారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఎస్‌బీ శివ, అర్చకులు కిరణ్, సురేష్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సభ్యులు కె.శారద, డి.రామలక్ష్మి, ఎస్.జయ, ఎం.లక్ష్మీసునీత, పీఎల్‌పీ రాణి, సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, బి.లీలాప్రసాద్, ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.



ఉత్సవంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు

18లోపు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కొల్లూరు: నూతనంగా రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కొల్లూరు వ్యవసాయశాఖాధికారి ఆర్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18లోపు కొత్తగా పొలాన్ని ఆన్‌లైన్ చేయించుకున్న వారు, అలాగే ఆన్‌లైన్‌లో చేర్చకుండా ఉన్న పొలాలు కలిగిన రైతులు ఆర్బీకేలు లేదా గ్రామ సచివాలయాల్లో 1బీ, పాస్ పుస్తకం, ఆధార్, రేషన్ కార్డ్, బ్యాంకు ఖాతా పుస్తకం జెరాక్స్, ఫోన్ నంబరుతో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమవ్వగా.. ఇంట్లో నిదురిస్తున్న ఓ యువకుడు మంటలకు తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఈ నెల 7న రాత్రి అమర్తలూరి సౌదామణికి చెందిన పూరింటికి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఇంట్లో ఆమె సోదరుడు కత్తి గాబ్రియేల్, కుమారుడు రవి కుమార్(26) నిద్రిస్తున్నారు. మంటల్లో కుమారుడు రవికుమార్ చిక్కుకుపోయాడు. అతని శరీరం సగ భాగానికి పైగా కాలిపోయింది. వెంటనే అతనిని 108 వాహనం ద్వారా తెనాలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వారం నుంచి చికిత్స పొందుతున్న రవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించారు. భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం చౌడవరం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీనివాసరావు (46) గుంటూరు నుంచి ఇంటికి తన ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో అదేరోడ్డులో చిలకలూరిపేటనుంచి గుంటూరు వైపుగా వెళుతున్న లారీ మితిమీరిన వేగంతో వెళుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులు సమాచారం అందించటంతో పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని బంధువులకు సమాచారం అందించి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'బ్రాహ్మణ' సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తమశర్మ



పోతావఝ్ఝుల పురుషోత్తమశర్మ

తెనాలి: ఏపీ బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తెనాలికి చెందిన పోతావఝ్ఝుల పురుషోత్తమ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు టౌన్ హాలులో మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదోనికి చెందిన వెల్లాల మధుసూదన శర్మ, కోశాధికారిగా కొత్తా ధర్మ సంస్థల అధినేత, ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ కొత్తా సుబ్బారావు ఎన్నికయ్యారు. తెనాలి బ్రాహ్మణ పరిషత్‌కు ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురుషోత్తమ శర్మ తాజా ఎన్నికపై పరిషత్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

5 వరకు 'మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ్ షెహర్'

నెహ్రూనగర్: మేరీ లైఫ్- మేరీ స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా గుంటూరు నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్) విధానాన్ని మే 20 నుంచి జూన్ 5 వరకు అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా నగరవాసులు, వ్యాపార వాణిజ్య సంస్థలు తమ వద్ద ఉన్న ఉపయోగించని, నిరుపయోగంగా ఉన్న దుస్తులు, పాదరక్షలు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇ-వ్యర్థాలను నగరపాలక సంస్థకు అందిస్తే, వాటిని పునర్వినియోగం, పునరుద్ధరణ లేదా కొత్త ఉత్పత్తికి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వస్తువుల సేకరణ ప్రాంతం, ఇతర అంశాల పై నగరంలో అన్ని వార్డు సచివాలయాల పరిధిలోని శానిటేషన్ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో గుంటూరు నగరపాలక సంస్థ ముందు భాగంలో ఉందని, ప్రస్తుత మేరీ లైఫ్ – మేరీ స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో కూడా నగర ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములై, ఇంటి వద్దకు వచ్చే వలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శుల ద్వారా వచ్చే ఆన్‌లైన్ లింక్ ద్వారా ప్రతిజ్ఞ నిర్వహించి నగరపాలక సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.

వేడుకగా రథోత్సవం

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రథోత్సవం నిర్వహించినట్లు పూజారి శ్రీనివాసమూర్తి తెలిపారు. భక్తుల సహకారంతో నూతన రథాన్ని ఆలయానికి సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానముల సాహిత్య ప్రాజెక్ట్ భజన మండలి సభ్యుల దీప సేవతో రథోత్సవాన్ని ప్రారంభించారు. నరసింహాచార్యులు వాస్తు హోమాది క్రతువులు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. అర్చకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కళాకారుడు సుగుణరాజుకు సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం దాగుడు మూతలు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం దేవుడు చేసిన మనుషులు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు, రేడియో, టీవీ, సినీ ఆర్టిస్ట్ గురిందపల్లి సుగుణరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి శివరాం ప్రసాద్, బొల్లేపల్లి వెంకట రవీంద్ర ప్రసాద్, పెద్దేటి యోహాను, కొల్లిపర సురేష్‌బాబు, నూతక్కి కోటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబ శివరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య పాల్గొన్నారు.



సుగుణరాజుకు సన్మానం

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

తెనాలిరూరల్: రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృత దేహాన్ని కొలనుకొండ స్టేషన్ సమీపంలో మంగళవారం పోలీసులు గుర్తించారు. పట్టాల వెంబడి మృత దేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, నీలం రంగు నిండు చేతుల చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



పట్టాల వెంబడి ఉన్న మృతదేహం

భార్యపై భర్త దాడి

తెనాలిరూరల్: భార్యపై భర్త దాడి చేసిన ఘటనకు సంబంధించి కేసు నమోదయ్యింది. పోలీసుల వివరాల మేరకు..వైకుంఠపురం కాలనీకి చెందిన శివమ్మపై ఆమె భర్త శివరాజు మంగళవారం దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు రాత్రి కేసు నమోదు చేశారు.